క్లుప్తంగా

నేడు అవగాహన సదస్సు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కడపలోనే ఉంచాలని, రాయలసీమలో ఉన్న ఏ సంస్థను ఇతర ప్రాంతాలకు తరలించకపోవద్దని బుధవారం నగరంలోని కాగితాలపెంట ఏపీజీబీ ఎదుట అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, ఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి, సిద్ధరామయ్య అన్నారు. మంగళవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏపీజీబీ ప్రధాన కార్యాలయం మా ప్రాంత ఆత్మ గౌరవం అని దానిని తరలిస్తే మేము చూస్తూ ఊరుకోమన్నారు. రాయలసీమ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో ఉద్యమాలను మరింత ఉధృతం చేసే ప్రయత్నం చేస్తున్నామని, అన్ని ప్రాంతాలలో దీనిపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.

12న సంక్రాంతి ముగ్గుల పోటీ

కడప కల్చరల్ : భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్), లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్యతోపాటు జిల్లా పోలీసుల సహకారంతో సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహిస్తున్నట్లు ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. ఈనెల 12న ఉదయం కడప నగరంలోని పోలీసు పెరేడ్ మైదానంలో ఈ పోటీ ఉంటుందన్నారు. రూ. 5000, రూ. 3000, రూ. 2000 బహుమతితో పాటు 20 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీ ప్రారంభమవుతుందని, ముగ్గు వేసేందుకు ఒకటిన్నర గంట సమయం ఉంటుందన్నారు. కేవలం చుక్కల ముగ్గులు వేయాలని, డిజైన్లు, ఆర్ట్ ముగ్గులు వేయకూడదని తెలిపారు. రంగు పొడులు, ముగ్గుపిండి పోటీదారులే తెచ్చుకోవాలని తెలిపారు. పోటీ ముగిసిన గంట తర్వాత అక్కడే బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. పాల్గొన దలిచిన వారు 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా 98855 86825 నెంబరులో పేరు నమోదు చేసుకోవాలన్నారు.

సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్: స్వాతంత్ర సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని కడప నగరంలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఒంటెద్దు ప్రదీప్ రెడ్డి, జాల జయవర్ధన్, అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి సుబ్బమ్మలు డిమాండ్ చేశారు. మంగళవారం కడప ఓంశాంతి నగర్‌లోని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కడప నగరం సుందరీకరణలో భాగంగా ప్రధాన కూడళ్లలో వివిధ స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. ఈ విషయాన్ని అనేక సందర్భాల్లో అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వం స్పందించి నగరంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత అగ్రగామి మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు అరుణ కుమారి, అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

పర్యావరణానికి ప్రథమ శత్రువు ప్లాస్టిక్



విద్యార్థులతో ముచ్చటిస్తున్న స్రవంతి

కడప ఎడ్యుకేషన్: పర్యావరణానికి ప్రథమ శత్రువు ప్లాస్టిక్కేనని ఏపీ ఎన్‌జీసి ఇన్‌చార్జ్ డైరెక్టర్ స్రవంతి పేర్కొన్నారు. మంగళవారం కడపలో బాలవికాస్, నాగార్జున మోడల్ స్కూల్ విద్యార్థులతో ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆమె బాల వికాస్ పాఠశాలలోని విద్యార్థులతో పర్యావరణం గొప్పతనాన్ని, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం నాగార్జున మోడల్ స్కూల్ సందర్శించి అక్కడ అటల్ టింకరింగ్ ల్యాబ్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు నేషనల్ గ్రీన్ క్రాప్స్ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీసి ప్రాజెక్టు ఆఫీసర్ సత్యనారాయణ, కడప మండల వనరుల కేంద్ర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

9న వేలం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని ఏపీఎస్ బీసీఎల్ డిపోలో ఈ నెల 9న వివిధ రకాల వస్తువులకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ వెంకటపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపోలోని ఒక్కొక్కటి ఫ్రిజ్ రూ. 18900, ఇన్వర్టర్, బ్యాటరీలు రూ.15,525, క్యాష్ చెస్ట్ రూ.5100, స్కానర్లు రూ.2837, క్యాష్ కౌటింగ్ మిషన్లు రూ.675 నిర్ణయించిన ధరతోపాటు అదనంగా 18 శాతం జీఎస్టీతో చెల్లించాలన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని వివరించారు.

ఎజెండా దారి ఎటువైపు..?

- అజెండా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించిన పాలకవర్గ సభ్యులు
- మినిట్స్ రాసి, సంతకాలు పెట్టడంలో తీవ్ర జాప్యం చేస్తున్న అధికారులు
- కమిషనర్‌కు, స్టాండింగ్ కౌన్సిల్‌కు వినతి పత్రాలు సమర్పించిన కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్: గత ఏడాది డిసెంబర్ 23వ తేదీ కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టిన ఎజెండాను మెజార్టీ సభ్యులు సంతకాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రకటించినా మినిట్స్ రాసి సంతకాలు పెట్టడంలో నగరపాలక అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో మంగళవారం వైఎస్సార్‌సీపీకి చెందిన 38 మంది కార్పొరేటర్లు కమిషనర్ మనోజ్‌రెడ్డిని కలిసి తాము ఏకగ్రీవంగా ఆమోదించిన అజెండా అంశాలపై మినిట్స్ రాసి, సంతకాలు పెట్టి ప్రభుత్వానికి పంపాలని వినతి పత్రం సమర్పించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

రెండోసారి కుర్చీ కోసమే...రచ్చ

కడప నగరపాలక సంస్థలో గత ఏడాది నవంబర్ 7న జరిగిన సర్వసభ్య సమావేశంలో తనకు వేదికపైన కుర్చీ వేయలేదని కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి నిల్చొని రాద్ధాంతం చేశారు. దీంతో ప్రజా సమస్యలపై చర్చ చేసేందుకు అవకాశం లేకపోవడంతో మేయర్ సభను వాయిదా వేశారు. ఆపై 2024 డిసెంబర్ 23న నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కూడా ఎమ్మెల్యే, పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లు కుర్చీ కోసమే మళ్లీ గొడవ చేశారు. ఈ పరిణామాల మధ్య మేయర్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా అదే సీన్ రిపీట్ కావడంతో ఎజెండాలోని అంశాలను చదువుకున్నారా అని మేయర్ కార్పొరేటర్లను అడిగారు...అందుకు వారు చదువుకున్నాం అని సమాధానమిచ్చారు. ఈ అంశాలను ఆమోదిస్తున్నారా... అని మళ్లీ అడుగగా...ఆమోదిస్తున్నట్లుగా చేతులు పైకెత్తారు. అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు మేయర్ ప్రకటించారు.

- నగరాభివృద్ధికి కీలకమైన 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావాలంటే పాలకవర్గం ఆమోదం తప్పనిసరి. తాము ఏకగ్రీవంగా ఆమోదించిన తర్వాత కూడా వాటిని మినిట్స్ బుక్‌లో రాసి సెక్రటరీ, కమిషనర్ సంతకాలు చేసి ప్రభుత్వానికి పంపడంలో నగరపాలక అధికారులు జాప్యం చేయడం అంటే నగరాభివృద్ధిని అడ్డుకోవడమేనని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు భావిస్తున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కమిషనర్ మనోజ్‌రెడ్డి, స్టాండింగ్ కౌన్సిల్ సుధాకర్ బాబ్జీని కలిసి వినతి పత్రం అందజేశారు. తాము ఏకగ్రీవంగా ఆమోదించిన అంశాలను మినిట్స్‌లో రాసి సంతకాలు చేయాలని కోరిన కార్పొరేటర్లతో ఆ గందరగోళంలో అక్కడ ఏం జరిగిందో తాను చూడలేదని అందుకే లీగల్ ఓపీనియన్‌కు రాశానని కమిషనర్ అన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం ఎటుపోయి ఎక్కడ ఆగుతుందో వేచిచూడాలి.



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

విద్యావేత్త వంశీకృష్ణకు ఎక్స్‌లెన్స్ అవార్డు



ఎక్స్‌లెన్స్ అవార్డుతో వంశీకృష్ణ

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని 'సంకల్ప్' క్లాసెస్ డైరెక్టర్ చెక్కిలం వంశీకృష్ణ 'ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు'ను అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈయనకు శాంతా బయోటెక్ ఎండీ వరప్రసాద్‌రెడ్డి, తెలంగాణ విద్యాశాఖ డైరెక్టర్ ఇ.వి. నరసింహారెడ్డి, సెయింట్ గ్రూప్ వ్యవస్థాపకులు బి.వి.ఆర్. మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వైస్ చైర్మన్ ప్రీతిరెడ్డి, మాజీ ఎంపీ బూర నరసయ్యగౌడ్, నరేంద్రరామ్, సి. విజయ తదితర ప్రముఖుల చేతుల మీదుగా ఈయన ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ఐఐటీ, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ వంటి పరీక్షల్లో జాతీయస్థాయిలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన విద్యావేత్తగా ఈయన జిల్లా ప్రజలకు సుపరిచితుడు. ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకోవడం పట్ల పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త ఆవిష్కరణకు సిద్ధం చేయాలి

కడప ఎడ్యుకేషన్: సృజనాత్మకతను వెలికితీసే విధంగా కొత్త ఆవిష్కరణలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని కడప 48వ డివిజన్ కార్పొరేటర్, సాయిబాబా విద్యాసంస్థల సీఈఓ శ్రీదేవి పేర్కొన్నారు. మంగళవారం కడప అక్కాయపల్లెలోని సాయిబాబా పాఠశాలలో అకడమిక్ ఒడిస్సీ కాంపిటీషన్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ యంవీ సాయి సుధీర్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్‌తోపాటు మెడల్స్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ అనితాప్లారెన్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కందుల రాజేశ్వరమ్మ జన్మదిన వేడుకలు



కళాశాల సిబ్బందితో కలిసి కేక్‌ను కట్ చేస్తున్న కందుల రాజేశ్వరమ్మ

కడప ఎడ్యుకేషన్: కందుల విద్యాసంస్థల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ 70వ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలోని కేఓఆర్ ఆడిటోరియంలో వైస్ చైర్మెన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆమె కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, వివిధ విభాగాల డీన్‌లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన బద్వేలు నేతలు



రవీంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న బద్వేల్ ఎమ్మెల్యే డా. సుధ, నియోజకవర్గ నేతలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డిని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఆ నియోజకవర్గ నేతలు కలిశారు. మంగళవారం వారు పార్టీ కార్యాలయంలో ఆయన్ను కలిసి తమను జిల్లా కమిటీలో నియమించినందుకు శాలువాలు కప్పి, పూలమాలలు అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుమారు 150 మందితో జిల్లా కమిటీని నియమించారని, అందరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ ఏ పిలుపు ఇచ్చినా పనిచేసేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, పులి సునీల్, రమేష్ బాబు, బ్రహ్మానంద రెడ్డి, హరికృష్ణారెడ్డి, నరసింహులు, లక్ష్మీనరసారెడ్డి, నాగేశ్వరరావు, రాజశేఖర్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. జిల్లాలోని పొద్దుటూరులో శ్రీ చైతన్య విద్యాసంస్థలకు చెందిన బస్ 26 ఏళ్ల వయస్సు ఉన అబ్దుల్ మునాఫ్‌ను ఢీ కొట్టిందన్నారు. ఇందుకు నిరసనగా మంగళవారం కడప వై జంక్షన్‌లో చైతన్య విద్యాసంస్థలకు వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ కడప నగర అధ్యక్షుడు హరిబాబు, శ్యాంసుందర్, కిరణ్, సుకుమార్, ప్రతాప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: పొద్దుటూరులో శ్రీ చైతన్య విద్యాసంస్థలకు చెందిన ఫిట్‌నెస్ లేని బస్సు అబ్దుల్ మునాఫ్ (26) సంవత్సరాలు అనే వ్యక్తిని ఢీకొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడని, వెంటనే ఆ విద్యాసంస్థల బస్సులను సీజ్ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి పేర్కొన్నారు. మంగళవారు ఫిట్‌నెస్ లేని శ్రీ చైతన్య బస్సులను వెంటనే సీజ్ చేయాలని కోరుతూ డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డికి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు వంశీ పాల్గొన్నారు.

ఇన్నోవేట్ సైబర్ టెక్ సొల్యూషన్స్‌తో వైవీయూ ఒప్పందం

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం, ఇన్నోవేట్ సైబర్ టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) మధ్య పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. ఆ సంస్థ సీఈవో మోనిక, ఎండీ అభిమన్యురావు, ప్రోగ్రాం డెవలపర్ మండూరు అయ్యప్ప, యోగివేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ్‌రెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వివిధ ప్రముఖ సంస్థలకు, పరిశ్రమలకి మానవ వనరులను అందించే సైబర్ టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తమ విద్యార్థులను నైపుణ్యత గల వారిగా తయారు చేస్తారని తెలిపారు. అలానే ఉద్యోగ అవకాశాలకు ప్రమోట్ చేస్తారని వివరించారు. సీఈఓ మోనిక మాట్లాడుతూ రెండేళ్ల పాటు ప్లేస్‌మెంట్ శిక్షణలు, ఇంటర్న్‌షిప్‌లు ప్లేస్‌మెంట్‌లను అందించడంలో సహాయపడుతామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్, సైబర్ ఆర్కి, ఒరాకిల్, హెచ్ సి ఎం, శాప్ ఏబి, శాప్ ఎండిజీ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, పైథాన్ జాంగో, శాప్ ఇంటోస్, ఫుల్ స్టాక్ పైథాన్, బ్లాక్ చైన్ డెవలప్‌మెంట్, క్లౌడ్ కంప్యూటింగ్ మొదలైన కోర్సులలో విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. సమావేశంలో ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ పి. సరిత పాల్గొన్నారు.



ఒప్పందం కుదుర్చుకుంటున్న వైవీయూ అధికారులు

సైనిక స్థూపాన్ని తిరిగి ఏర్పాటు చేయాలి



జిల్లా సైనిక సంక్షేమాధికారికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ సైనికులు

వైవీయూ: కడప నగరం యర్రముక్కపల్లెలోని సైనిక్ సర్కిల్‌లో తిరిగి సైనిక స్థూపాన్ని ఏర్పాటు చేయాలని మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వి.రావు కోరారు. మంగళవారం కడప నగరంలోని జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి అధికారి రజాక్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు మాట్లాడుతూ గతంలో యర్రముక్కపల్లెలోని సైనిక్‌సర్కిల్‌లో సైన్యం గొప్పదనాన్ని చాటిచెప్పేలా, ప్రాణత్యాగం చేసిన వీరజవాన్ల జ్ఞాపకార్థం అమరవీరుల సైనిక స్థూపం ఉండేదని, సర్కిల్ అభివృద్ధిలో భాగంగా దాన్ని తొలిగించిన అధికారులు తిరిగి ఏర్పాటు చేయడం మరిచిపోయారన్నారు. తిరిగి అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన అధికారి రజాక్‌ఖాన్ సమస్యను నగరపాలక కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధులు పుల్లయ్యానాయుడు, ఓబులేసు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి

కడప రూరల్: రాయలసీమలోని పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను సత్వరం పూర్తిచేయాలని వక్తలు తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సి ఆర్ వి ప్రసాద్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ, సత్తార్ మాట్లాడుతూ హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగు గంగ, వెలుగొండ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నదుల అనుసంధానం చేయాలనుకోవడం అవివేకమని తెలిపారు. కాగా పెండింగ్‌లో ఉన్న 55 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి 35 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం పేరుతో రూ. 80 వేల కోట్ల తో పథకం రూపొందించి కేంద్ర ప్రభుత్వం ఆమోదం కోసం పంపుతున్నట్లుగా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా 385 టీఎంసీల నీటిని కృష్ణానదికి మళ్లించి రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మొదట పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుర్రప్ప, అంజి, దేవర శ్రీకృష్ణ, సుబ్బరాయుడు, శంకర్, జయవర్ధన్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నేతలు

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : స్కీం వర్కర్లకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మంజుల డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి పిలుపుమేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో వారు మాట్లాడారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మినీ టీచర్లందరినీ మెయిన్ టీచర్లుగా గుర్తించాలన్నారు. విధుల్లో మృతి చెందిన వారికి రూ. 5 లక్షల పరిహారం, రూ. 20 వేలు మట్టి ఖర్చులకు ఇవ్వాలని కోరారు. అలాగే ఇంటిలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, డిప్యూటీ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రాట్యూటీ వెంటనే అమలు చేయాలని, గౌరవ వేతనాల బిల్లులు ప్రతినెలా 5వ తేదీలోగా చెల్లించాలని కోరారు. సంక్షేమ పథకాలను అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు వర్తింపజేయాలన్నారు. ప్రజాసాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగి అనే నమోదును తక్షణమే తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు సుబ్బరాయుడు, డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, అంగన్వాడీ నాయకులు విజయ, సుజాత, యశోద, శ్రీదేవి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీ, ఏఐటీయూసీ నాయకులు

సమస్యలు పరిష్కరించాలి



మోచంపేట వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆశా, అంగన్వాడీ , మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని మోచంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన తెలిపి డాక్టర్ అనితకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తున్న ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు పిచ్చినేని సుబ్బరాయుడు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు ఏ .ఎల్. నరసమ్మ, బి. శాంతమ్మ , రాణి, ప్రియదర్శిని, జమాల్ బి, సుధామణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

కడప సెవెన్‌రోడ్స్ : అభివృద్ధి చెందిన జిల్లాలతో సమానంగా రాష్ట్రంలోని వెనకబడిన జిల్లాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో కూడా ఇందుకోసం నిధులు కేటాయించాలని కోరారు. రాయలసీమ జిల్లాల్లో భారీ పరిశ్రమలు నిర్మించాలన్నారు. కడపలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలన్న విభజన చట్టంలోని హామీని అమలు చేయాలన్నారు. ఇందుకోసం అవసరమైన నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరారు. గోదావరి మిగులు నీటిని కృష్ణా బేసిన్‌కు తరలించి ఇక్కడి నుంచి రాయలసీమకు మళ్లించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ శాశ్వత కరువు నివారణకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. వివిధ రకాల ఖనిజ సంపద ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని, అయితే పాలకుల్లో చిత్తశుద్ధి లోపించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఐఎన్ సుబ్బమ్మ, ఎ.రామ్మోహన్‌రెడ్డి, బి.దస్తగిరిరెడ్డి, వి.అన్వేష్, పి.చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

యువత చేతిలోనే దేశభవిత

వైవీయూ: యువతే మనదేశ బలమని.. యువత చేతిలోనే దేశభవిష్యత్తు ఉందని చిన్మయామిషన్ కార్యదర్శి స్వామి తురియానంద పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'ఉత్తిష్ఠ భారత్ 3.0' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి తురియానంద మాట్లాడుతూ కడప నగరంలోని మేడా కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు రాష్ట్రస్థాయి యూత్ కన్వెన్షన్ ట్రెనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన యువత ఈ కార్యక్రమంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం లైఫ్‌స్కిల్స్, మైండ్‌ఫుల్‌నెస్, భవిష్యత్‌పై కేంద్రీకరించాల్సిన అంశాలపై ఆయన క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డా. బి.ఆర్. శైలజ, ఆర్థిక నిపుణులు డాక్టర్ పి. వెంకటరామిరెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. పి. గురివిరెడ్డి, వైవీయూ క్రీడాశాస్త్ర శాఖ విభాగాధిపతి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు విజయలక్ష్మిదేవి, శచీదేవి, సుబ్బారెడ్డి, కె.వి.రమణ, ఎం.వి. రమణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు లైఫ్‌స్కిల్స్ గురించి వివరిస్తున్న చిన్మయామిషన్ కార్యదర్శి స్వామి తురియానంద

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన తల్లికి వందనం పథకం ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాలనిని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని పీఎస్‌యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికి వందనం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అమలు చేయక పోవడం దారుణం అన్నారు. పథకం వెంటనే అమలు చేయకపోతే ప్రగతిశీల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ యు నాయకులు నరేంద్ర, గోపి, నరసింహ, రాంచరణ్, అయాన్, కేశవ, అనిల్, షాలేంరాజు పాల్గొన్నారు.

ముగ్గురాయి టెండర్లను రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: మంగంపేటలోని ముగ్గురాయి గనిని మూసి వేయటానికి, లేదా ప్రైవేట్ సంస్థలకు కట్ట పెట్టడానికి కుట్ర జరుగుతోందని, ఆ కుట్రలో భాగమే తక్కువ ధరకు టెండర్లను పిలిచారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగంపేట ముగ్గురాయికి బయట ప్రాంతాలలో ఏమాత్రం డిమాండ్ తగ్గలేదని, ఉద్దేశపూర్వకంగానే రూ. 1620 ఉన్న టన్నును, రూ. 1100 అమ్మడం వెనుక ఏదో మతలబు దాగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధరామయ్య, ఆర్టీయూ నగర కార్యదర్శి మడగలం ప్రసాద్ పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. ఈనెల 11న శనిత్రయోదశి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీ శనీశ్వరస్వామికి తైలాభిషేకం నిర్వహిస్తామని నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ తెలిపారు. 12న శ్రీ విజయదుర్గ సమేత మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం చేపట్టనున్నామన్నారు. 13న పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, చండీహోమం నిర్వహిస్తామన్నారు.